క్లుప్తంగా

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

యాలాల: కొత్తగా పట్టాపాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని రాస్నం క్లస్టర్ ఏఈఓ శిరీష కోరారు. రైతు బీమా ఫారానికి పట్టాపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను జతచేసి, నేరుగా ఏఈఓకు అందజేయాలని సూచించారు. దరఖాస్తుకు చివరి గడువు ఆగస్టు 4 అని, రైతులు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

కోరం లేక సభ వాయిదా

బంట్వారం: కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం జరగాల్సిన సమీక్షకు మండల పరిషత్ కార్యాలయ అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఎంపీపీ ప్రభాకర్, జెడ్పీటీసీ సంతోష, పలువురు సర్పంచ్‌లు, అధికారులు హాజరయ్యారు. మండల ప్రాదేశిక సభ్యులు 6 మందికి గాను ఎంపీపీ మినహా మిగతా వారంతా గైర్హాజరయ్యారు. మరో ఎంపీటీసీ సభ్యుడు వచ్చి ఉంటే ఎంపీపీతో కలిపితే కోరం సరిపోయి ఉండేది. మధ్యాహ్నం 12 గంటలు దాటినా ఒక్క ఎంపీటీసీ సభ్యుడు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ప్రభాకర్ ప్రకటించారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలో వెల్లడిస్తామని తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

తాండూరు రూరల్: మండల పరిధి గ్రామాల్లో ఈవీఎంలపై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. బుధవారం కోత్లాపూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లపై గ్రామస్తులకు ఓటు వేసే విధానం, గుర్తులు, వీవీ ప్యాడ్స్‌పై మీట ఎలా నొక్కాలో చూపించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఆలయ చైర్మన్ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా స్వచ్ఛ సర్వేక్షణ్



వడ్డెరగల్లీలో సర్వే చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొడంగల్ రూరల్: పారిశుద్ధ్య నిర్వహణపై మున్సిపల్ సిబ్బంది పట్టణంలో ముమ్మరంగా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే చేపట్టారు. జట్లుగా ఏర్పడి, ఇంటింటికీ తిరుగుతూ చెత్త వాహనం వస్తుందా లేదా, ఇంటి పరిసరాల్లో శుభ్రం చేయడానికి మున్సిపల్ సిబ్బంది వస్తున్నారా లేదా అనే సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా పుర సిబ్బంది ఇంటి యజమానులతో మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని కోరుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల కాలం అని, నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది ఆనందమ్మ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నేడు మంత్రి తలసాని రాక

తాండూరు: పశుసంవర్థక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం తాండూరు పట్టణంలో పర్యటించనున్నారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఈ నెల 3వ తేదీ నుంచి శ్రీ రాజశ్యామల, శతచండీ, సౌర, లక్ష్మీసుదర్శన సహిత అతిరుద్ర మహాయాగాలను నిర్వహిస్తున్నారు. ఈ యాగ క్రతువుకు ఉదయం 11.30 గంటలకు మంత్రి తలసాని హాజరుకానున్నారని పశు సంవర్థక శాఖ ఓఎస్‌డీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం

పెద్దేముల్: ప్రమాదాల్లో గాయపడిన బీఆర్ఎస్ కార్యకర్తలు డబ్బుల చంద్రమ్మకు రూ.10వేలు, సందుల బసంతికి రూ.5వేలు, తలారి రవికి రూ.5వేల నగదును ఆర్థిక సహాయంగా పార్టీ మండల అధ్యక్షుడు కోహీర్ శ్రీనివాస్ బుధవారం అందజేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు దాసరి ప్రసాద్, వెంకటయ్య, రాములు, శ్రీనివాస్, అంజయ్య, రమేష్‌గౌడ్, మహేశ్ గౌడ్, ఎల్లప్ప పాల్గొన్నారు.

కార్మిక కుటుంబానికి..

కొడంగల్ రూరల్: మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగించిన జోగు రమేష్(38) బుధవారం అనారోగ్య కారణాలతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తూము రాములు, కోశాధికారి చింతకాయల అంజి, జిల్లా ప్రధాన కార్యదర్శి మొగులయ్య, ఉపాధ్యక్షుడు చిన్న పకీరప్ప, కార్యదర్శి అయినన్‌పల్లి చిన్న వెంకటయ్యలు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు.

కాంగ్రెస్ హయాంలోనే ఉచిత విద్యుత్

- ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్

తాండూరు: వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని ఏఐసీసీ సభ్యుడు రమేష్ మహరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ నాయకులపై బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉన్నారని, ఆయన వచ్చాకే ఏం మాట్లాడారనేది ప్రజలకు వివరిస్తామని ఆయన వెల్లడించారు. 15 ఏళ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత నేత, ముఖ్యమంత్రి వైఎస్సార్ రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. నాటి పథకాన్నే ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ప్రకటించారు.

మిన్నంటిన నిరసనలు

పోటాపోటీగా సీఎం కేసీఆర్, రేవంత్ దిష్టిబొమ్మల దహనం



పెద్దేముల్: రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తాండూరు రూరల్: గౌతపూర్ చౌరస్తాలో..

■ **కర్షకులకు కాంగ్రెస్ క్షమాపణలు చెప్పాలి**

ఉచిత విద్యుత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా జిల్లాలో నిరసనలు మిన్నంటాయి. గులాబీ శ్రేణులు రేవంత్‌పై మండిపడితూ.. ఆయన దిష్టిబొమ్మలను దహనం చేసి మాట్లాడారు. 'నాడు సాగు దండగ అన్న నేతల నోళ్లు మూయించడానికి అహో రాత్రులు శ్రమించి, వ్యవసాయానికి నిరంతరం ఉచిత విద్యుత్ సరఫరా చేస్తూ.. పండుగలా మార్చిన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కాంగ్రెస్ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడటం మంచికాదు అని' హితవు పలికారు. రైతులకు కరెంటు కష్టాలు తీర్చడాన్ని హస్తం నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని, కర్షకులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్

■ **రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించిన బీఆర్ఎస్**

'ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఓటమి భయం వెంటాడుతోంది. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించి, రాజకీయ లబ్ధి పొందుతున్నారు' అని హస్తం నేతలు మండిపడ్డారు. మూడు గంటలు కూడా రైతులకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉచిత విద్యుత్‌పై సరఫరా చేయడం లేదని రేవంత్ చేసిన వ్యాఖ్యలను మార్చి.. కాంగ్రెస్‌పై అధికార పార్టీ విషం చిమ్ముతోందని హస్తం నేతలు విమర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



పూడూరు: మన్నెగూడ చౌరస్తాలో కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాండూరులో.. బీఆర్ఎస్ నాయకులు



కుల్కచర్లలో.. కాంగ్రెస్ నాయకులు



అనంతగిరి: వికారాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి తదితరులు



కుల్కచర్ల: పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి ఆధ్వర్యంలో..



ధారూరులో.. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజునాయక్ తదితరులు

నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

తాండూరు టౌన్: నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్ అని, అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన చికిత్స పొందడానికి సీఎం సహాయనిధి ఆసరాగా నిలుస్తుందని ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. లబ్ధిదారులైన పెద్దేముల్‌కు చెందిన రాజేశ్వర్ రావుకు రూ.60 వేలు, సిరిగిరిపేట్‌కు చెందిన జగదీశ్వర్‌కు రూ.36 వేలు, పట్టణంలోని పూడూరు గల్లికి చెందిన శివకుమార్‌కు రూ.23,500ల చెక్కులను ఆయన బుధవారం తాండూరులో అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, నాయకులు అబ్దుల్ రవూఫ్, పట్లోళ్ల బాల్‌రెడ్డి, పట్లోళ్ల నర్సింహులు, బిర్కట్ రఘు, కౌన్సిలర్ రామకృష్ణ, రాకేష్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ

డ్రోన్ల సహాయంతో పిచికారీ



పత్తి చేలో గడ్డి మందును పిచికారీ చేస్తున్న డ్రోన్

ధారూరు: ఎకరా నుంచి 30 ఎకరాల వరకు ఉన్న రైతులు తమ పంట పొలాల్లో డ్రోన్ల సహాయంతో క్రిమి సంహారిక మందులు పిచికారీ చేయిస్తున్నారు. ధారూరు మండలం నాగారం, నాగ్‌సాన్‌పల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు యువకులు రూ.8 లక్షలు వెచ్చించి, డ్రోన్లను విక్రయించారు. వీటి సహాయంతో పంటలకు మందుల పిచికారీ చేస్తామని, ఎకరాకు రూ.600 మాత్రమే తీసుకుంటామని ప్రచారం చేశారు. దీంతో రైతులు పోటీపడి డ్రోన్లతో మందుల పిచికారికి ఆసక్తి చూపుతున్నారు. కొండాపూర్‌కలాన్‌కు చెందిన నారాయణ రెడ్డి అనే రైతు తన 10 ఎకరాల పత్తి పొలంలో గడ్డిమందును పిచికారి చేయించారు. కూలీలకు ఇచ్చే డబ్బుల్లో సగం వెచ్చిస్తే నిమిషాల్లో పని పూర్తి చేస్తామని దస్తయ్యగౌడ్, ప్రకాశ్ గౌడ్‌లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో తక్కువ నీరు, తక్కువ మందుతో పంటలపై కలుపు నివారణ మందును డ్రోన్ పిచికారి చేస్తుందని వారు వివరించారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి

నవాబుపేట: ధరణి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ్ జిల్లా అధ్యక్షుడు మల్‌రెడ్డి మాట్లాడారు. ధరణిలో ఆప్షన్‌లు లేవంటూ అధికారులు రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. కష్టజీవులైన రైతులను ధరణి పేరుతో ఇబ్బందులకు గురిచేయడం తగదని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ్ నాయకులు మాణిక్ రెడ్డి, రాంరెడ్డి, పాపిరెడ్డి, వెంకయ్య, శ్రీశైలం, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కొండల్, నర్సింహులు, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘ్ నేతలు

శాంతిభద్రతలకు సహకరించాలి



ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

పెద్దేముల్: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పాత పోలీస్ స్టేషన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి బదిలీ కావడం, అదేరోజు రిలీవ్ కావడంతో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని ఎస్‌ఐని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి జిల్లా నుంచి వెళ్లిపోవడం బాధాకరం అని, ఆయన సేవలను కొనియాడారు. ఎవరితో దురుసుగా ప్రవర్తించకుండా.. ఆయన ప్రజలకు న్యాయం చేశారని చెప్పారు. చరణ్ ఎక్కడ పని చేసినా పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ శేఖర్‌గౌడ్, ఏఎస్‌ఐ నారాయణ, తాండూరు వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శిబ్లి, రవికాంత్, వెంకటరెడ్డి, నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ రమేష్ సిబ్బంది పాల్గొని ఎస్‌ఐకి వీడ్కోలు పలికారు.

14న సర్వసభ్య సమావేశం

యాలాల: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయాలి

మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేసేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మర్పల్లి మండలం బూచన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ 80 మంది కార్యకర్తలు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి సమక్షంలో జాతీయ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో మాజీ మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పాలనపై విసుగు చెందిన ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ బూచన్‌పల్లి గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు బిచ్చిరెడ్డి, నర్సింహ్మారెడ్డి, బక్కారెడ్డి, జన్ముల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



మర్పల్లి: పార్టీలో చేరిన వారితో ప్రసాద్‌కుమార్

ప్రాణం ఉన్నంత వరకు..

ధారూరు: ప్రాణం ఉన్నంత వరకు కండువా తీయమనే వారు కాంగ్రెస్ కండువా వేసుకోవాలని మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు చెందిన 40 మంది కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి, పార్టీ ధారూరు మండలం అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు గడిల మల్లారెడ్డి, మహమ్మద్ బాబాఖాన్, అశోక్ ముదిరాజ్, ముజాఫర్, కార్తీక్‌రెడ్డి, అన్సారి, సంగమేశ్, లింగం గౌడ్, నెల్లి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాలు

దోమ/ పెద్దేముల్: దోమ మండలం బొంపల్లి, పెద్దేముల్‌లో పోచమ్మకు గ్రామస్తులు బోనమెత్తారు. ఈ సందర్భంగా నెత్తిన బోనంతో డప్పు దరువుల మధ్య, శివసత్తు పూనకాలతో భక్తులు ఊరేగింపుగా పోచమ్మ ఆలయానికి చేరుకొని, మొక్కులు తీర్చుకున్నారు.



దోమ: బోనాలతో ఊరేగింపుగా భక్తులు



మోమిన్‌పేటలో..



పెద్దేముల్‌లో..

పత్తి సాగులో పూత పద్ధతి మేలు



పత్తికి మందు పూస్తున్న రైతులు

మోమిన్‌పేట: పత్తి సాగులో పెను బంక, దోమల నివారణకు పూత పద్ధతి ఎంతో మేలని మండల వ్యవసాయ అధికారి జయశంకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడారు. పత్తి సాగు గురించి పలు సూచనలు చేశారు. మొదట పంటకు మందులను పిచికారి చేయడం, నీటి, కూలీల ఖర్చులను అధిగ మించేందుకు పూత మార్గం మంచిదని చెప్పారు. పత్తిని విత్తుకున్న 40రోజుల నుంచి పెను బంక, దోమలు పంటను ఆశించి రసం పీల్చి ఎదుగుదలను ఆపేసి రైతులకు నష్టం కలగ చేస్తాయని పేర్కొన్నారు. వర్షాభావ పరిస్థితుల వలన పెను బంక ఆశిస్తుందని, విత్తిన 40 నుంచి 60 రోజులకు రెండు సార్లు పత్తిలో పూత పద్ధతి ద్వారా రసం పీల్చే పురుగును అరికట్టవచ్చని వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్లో పెయిటింగ్ రూలర్లు అందుబాటులో ఉన్నాయని, రసం పీల్చే పురుగు నివారణకు 100మి.లీ. మోనోక్రోటోఫాస్ మందులో 400మి.లీ. నీటిని కలిపి రూలర్ ద్వారా పత్తి కాండంపైన పూత పూయాలని సూచించారు. ఎకరాకు 100మి.లీ. మందు సరిపోతుందని చెప్పారు.



మట్టికొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిన కందనెల్లి వంతెన వద్ద రోడ్డు

పెద్దేముల్: నాలుగు రోజుల క్రితం కురిసిన భారి వర్షానికి పెద్దేముల్ మండలం కందనెల్లి వంతెన ప్రధాన రహదారి పక్కన గండి పడింది. రోడ్డుకు ఇరువైపులా పోసిన మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు త్వరగా స్పందించి గండి పూడ్చించాలని, ఆలస్యం చేస్తే రోడ్డు కూడా కుంగిపోయే ప్రమాదం ఉందని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని**

తాండూరు టౌన్: విద్యార్థి సంఘాలైన పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో బుధవారం తాండూరు పట్టణంలోని పాఠశాలల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం నాయకులు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. మనఊరు, మనబడితో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందని ఆరోపించారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నరేష్, ప్రకాష్, బాలరాజ్, ఆకాష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, మహమూద్, నవీన్ పాల్గొన్నారు.

◆ **ఓటు హక్కు వినియోగించుకోవాలి**

అనంతగిరి: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మద్గుల్ చిట్టంపల్లి కౌన్సిలర్ గోపాల్ కోరారు. ఈ మేరకు బుధవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఈవీఎం, ఓటు హక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

◆ **కార్మికుల అర్ధనగ్న నిరసన**

బొంరాస్‌పేట: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు నిరవధిక దీక్ష చేస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో అర్ధనగ్న ప్రదర్శన చేసి, నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమ్మెకు కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. పార్టీ మండల నాయకులు నర్సింహులు గౌడ్, నర్సింహులు నాయుడు, రామచంద్రారెడ్డి, రాములు ఉన్నారు.



అర్ధనగ్న నిరసన తెలుపుతున్న కార్మికులు

◆ **పర్మినెంట్ చేయాలి**

అనంతగిరి: జీపీ సిబ్బందికి వేతనాలు పెంచడంతో పాటు, వారిని పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోబార్, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహాయ కార్యదర్శిగా నియమించాలన్నారు. ప్రతి ఒక్కరికీ ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

◆ **నేడు ఆరోగ్య చేవెళ్ల రథం ప్రారంభం**

ధారూరు: ధారూరు మండలం నాగసమందర్‌లో గురువారం చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి ఆరోగ్య చేవెళ్ల రథాన్ని ప్రారంభించనున్నారని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనంద్ పాల్గొంటారని తెలిపారు.

◆ **కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షుడిగా**



కుల్కచర్ల: కాంగ్రెస్ పార్టీ కుల్కచర్ల మండలం యువజన విభాగం అధ్యక్షుడిగా జంగయ్య ముదిరాజ్‌ను నియమించారు. ఈ మేరకు బుధవారం ఆయనకు డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి నియామక పత్రం అందజేశారు.

◆ **ఎమ్మెల్యే సారూ.. ఈ రోడ్డును చూడండి**



గుంతలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష

బంట్వారం: ఎమ్మెల్యే సారూ జర ఈ రోడ్డును చూడండి అని జెడ్పీటీసీ సంతోష కోరారు. బంట్వారం, తొర్మామిడి రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆమె బుధవారం పరిశీలించి మాట్లాడారు. మండలంలో రోడ్లు పూర్తిగా అధ్వానంగా తయారయినా.. మరమ్మతులు చేపట్టడం లేదన్నారు. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆమె వెంట కాంగ్రెస్ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వెంకటేశం ఉన్నారు.